

# రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- కడెంలో పర్యటించిన విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

కడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాల ద్వారానే దిగుబడి సాధ్యం అవుతుందని, రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి తెలిపారు. కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామంలో రైతు వేదికలో రైతులతో ప్రత్యక్షంగా సమావేశమై విత్తన సరఫరా, విత్తన నాణ్యత, రాబోయే సీజన్ సాగు పద్ధతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని, అందుకోసం విత్తనాభివృద్ధి సంస్థ పూర్తి స్థాయిలో కట్టుబడి పని చేస్తుందని అన్వేష్ రెడ్డి రైతులకు తెలియజేశారు. రైతులు నాణ్యమైన ధ్రువీకరించబడిన విత్తనాలను ఉపయోగించి అధిక ఉత్పాదకతను సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# భైంసా ఏఎస్పీగా రాజేష్ మీనా



ఏఎస్పీ రాజేష్ మీనా

భైంసా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భైంసా సబ్ డివిజన్ నూతన ఏఎస్పీగా రాజేష్ మీనా శుక్రవారం నియమితులయ్యారు. ప్రస్తుతం భైంసా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న అవినాష్ కుమార్ కొత్తగూడెం కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిర్మల్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ మీనా ఇక్కడికి బదిలీపై వచ్చారు.

# లడ్డూ ధర పెంపుపై హిందూ సంఘాల నిరసన



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న హిందూ సంఘ నేతలు

బాసర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో రూ.150 అక్షరాభ్యాస కార్యక్రమానికి భక్తులకు ఉచితంగా అందించే లడ్డూను నిలిపివేయడం, అలాగే అభిషేకం లడ్డు ధరను రూ. 100 నుండి రూ. 150కు పెంచడంపై హిందూ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ విషయమై హిందూ సంఘాల నాయకులు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుదర్శన్‌గౌడ్‌ను కలిసి తమ విజ్ఞాపన పత్రాన్ని అందేశారు. ఈ సందర్భంగా భక్తులకు కలుగుతున్న ప్రధాన సమస్యలపై ఆలయంలో జరుగుతున్న పలు అవకతవలపై ఆలయ అధికారులతో హిందూ సంఘాల నాయకులు చర్చించారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని ఎండోమెంట్ అధికాయులు కేవలం వ్యాపార కేంద్రంగా చూడడంపై వాయ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ శివాజీ సేన సమితి అధ్యక్షులు పన్నెంవార్ శ్రీహరి, కార్యదర్శి చేతర్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

## అధికారుల సమష్టి కృషికి నిదర్శనమే

# అవార్డులు, రివార్డులు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అధికారుల సమిష్టి కృషికి నిదర్శనంగానే అవార్డులు, రివార్డులు లభిస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇటీవల జిల్లాకు లభించిన 'జల సంచాయ్ - జన భాగీదారి అవార్డు సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల సంరక్షణలో అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది, ప్రజల భాగస్వామ్యమే ఈ అవార్డుకు కారణం అన్నారు. లక్ష్యాలను సమయానికి చేరుకోవడమే కాకుండా, అమలు విధానంలో పారదర్శకత చూపడంతోనే రాష్ట్ర స్థాయిలో జిల్లా ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో భూగర్భ జలాల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ ప్రాజెక్టులు, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలలో అధికారులు అద్భుతంగా పని చేశారని కొనియాడారు. ముందు ముందు ఇదే ఉత్సాహం కొనసాగించాలని సూచించారు. నలుగురు క్షేత్రస్థాయి ఉద్యోగులు మాట్లాడుతూ అత్యల్ప సమయంలో సమర్థ వంతంగా కార్యక్రమాలు పూర్తిచేయడాని కి కలెక్టర్ మార్గ నిర్దేశం ముఖ్య కారణమని తెలిపారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేసి, అవార్డు సాధనలో సేవలందించిన అధికారులను సన్మానించారు. అనంతరం 18 ఫాగింగ్ యంత్రాలను మండల స్థాయిలో ఎంపీవోలకు కలెక్టర్ పంపిణీ చేశారు. వర్షాకాలంలో దోమల నిర్మూలనకు వీటిని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.





# కాంట్రాక్టర్లు కావలెను

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- టెండర్ల రీకాల్‌కు స్పందన కరువు
- పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

నిర్మల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన రోడ్లు, వంతెనలు ఇతర మరమతు పనులకు ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. గత నెల రోజుల నుంచి సంబంధిత శాఖల అధికారులు గుత్తేదారులను పనులు చేయాలని కోరుతున్నప్పటికీ వారు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఈ పనులకు సంబంధించి ఇప్పటి వరకు ఆరేడు సార్లు టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఒక కాంట్రాక్టర్ ఈ టెండర్‌లో పాల్గొనకుండా నిరాసక్తత చూపుతున్నారు. ప్రభుత్వం నిధుల కొరత కారణంగా ఎప్పటికప్పుడు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయకపోతుండడంతోనే గుత్తేదారులు పనులు చేసేందుకు జంకుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖలో దాదాపు రూ.100 కోట్లకు పైగా వివిధ రకాల పనులు చేపట్టాల్సి ఉంది. అయితే తమకు గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు రాలేదని ఇక భవిష్యత్‌లో వస్తాయన్న ఆశ లేదని ఆ పనుల కోసం చేసిన అప్పులే ఇప్పటి వరకు తీరలేదని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈ పనులు వేసవి కాలంలోనే పూర్తి కావాల్సి ఉండడంతో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాగైనా ఈ పనులను పూర్తి చేసేందుకు తంటాలు పడుతున్నారు. ఈ పరిణామాల కారణంగా డబ్బులు ఆ శాఖల నుంచి వెనక్కి తిరిగి పోవడమే కాకుండా రోడ్లు, వంతెనలు, ఇతర మరమత్తుల పనులు నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయని ఇంజనీరింగ్ శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

### ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో...

ఆర్ అండ్ బీ శాఖకు రెన్యూవల్ కింద 19 పనుల కోసం రూ.50 కోట్లు మంజూరయ్యాయి. మొదటి దఫా టెండర్లను పిలవగా ఒక్క కాంట్రాక్టర్ టెండర్ దాఖలు చేయలేదు. అయితే అధికారులు రంగంలోకి దిగి బలవంతంగా 19 పనులకు గానూ 17 పనులకు టెండర్లు దాఖలు చేయించారు. అధికారులు ఒత్తిడి తేవడంతో ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాలేవని అప్పుల్లో కూరుకుపోయామని అన్నారు.

### పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో...

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఎంఆర్‌ఆర్, ఫ్లడ్ డ్యామేజీ రిపేర్స్ పనులు చేపట్టేందుకు రూ.64 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 50 పనులకు గానూ అధికారులు టెండర్లు పిలిచిన ఏ ఒక్క కాంట్రాక్టర్ ఈ పనులను చేపట్టేందుకు టెండర్ దాఖలు చేయలేదు. అయినప్పటికి గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని తాము పనులు ఎలా చేయాలంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

# జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు

- సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్
- మద్యం తాగి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు
- జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరిక



నిర్మల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలను మరింత కట్టుదిట్టం చేసినట్లు జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి వాహనానికి సంబంధించిన తప్పనిసరి పత్రాలు వాహన దారులు తమ వద్ద ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ పత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేయడంతో పాటు సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇటీవల చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో మద్యం తాగి వాహనం నడపడం నేరమని, అలాంటి వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష చూప బోమని ఎస్పీ హెచ్చరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్

# పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

ముథోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు హాజరయ్యారు. సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్‌లు పోలీస్ స్టేషన్ వ్యవస్థ, నిర్వహణ గురించి విద్యార్థులకు తెలియజేశారు. పోలీస్ స్టేషన్ లాకప్ గది, వైర్లెస్ సెట్ వాడకం, కేసుల నమోదు, రిసెప్షన్ కౌంటర్, తుపాకుల వాడకం గురించి క్లుప్తంగా తెలియజేశారు. పోలీసులు ప్రజల భద్రత కోసం నిరంతరం పని చేస్తారన్నారని సీఐ పేర్కొన్నారు. పోలీసులు విధి నిర్వహణలో 24 గంటలు ప్రజల భద్రతకే పెద్దపీట వేస్తారన్నారు. మీ పరిసరాల్లో ఏదైనా సంఘటన జరిగితే పోలీసులకు తెలియ జేయాల్సిన బాధ్యత గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, చుట్టు పక్కల వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంగపుత్రుల ఐక్యతా ర్యాలీ

- మత్స్యకారుల సంక్షేమ పథకాలను మెరుగుపర్చాలని గాడి ప్రభాకర్ డిమాండ్



మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్ మండలంలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వ ర్యంలో భారీ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. వృత్తిలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, తమ ఐక్యతను చాటి చెప్పడం లక్ష్యంగా ఈ ర్యాలీని చేపట్టారు. సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మత్స్యకారుల హక్కులు, జల వనరుల సంరక్షణకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నర్సాపూర్ ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంఘం నాయకులు గాడి ప్రభాకర్ మాట్లాడుతూ... మత్స్యకారుల దినోత్సవం కేవలం వేడుక మాత్రమే కాదని, మత్స్య సంపదను, వాటికి ఆధారమైన జల వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఆయన ప్రసంగంలో సంక్షేమ పథకాల విస్తరణ, కాలుష్య నివారణ, ఆధునిక వసతుల కల్పన వంటి కీలక డిమాండ్లను ప్రస్తావించారు. వృత్తిని మెరుగుపరుచుకునేందుకు మత్స్యకారులకు సులభ పద్ధతిలో బ్యాంక్ రుణాలు, బోట్లు, వలలపై రాయితీలను పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ ర్యాలీలో సంఘం ప్రముఖులు సాయన్న, అశోక్, నవీన్, గంగారాం, సంతోష్, అనిల్‌తో పాటు నర్సాపూర్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి గంగపుత్ర సంఘ సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మత్స్యకారులు తమ సమస్యల పరిష్కారానికై ఐక్యతతో పోరాడాలని సంఘం నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సంఘ అధ్యక్షుడు పరిమి సురేష్



ఖానాపూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న గంగపుత్రులు

ఖానాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం ఖానాపూర్ అధ్యక్షుడు పరిమి సురేష్ అన్నారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీష్మ పితామహుని చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం నీలి రంగులో ఉన్న గంగపుత్ర సంఘం జెండాను ఆవిష్కరించారు.

# విద్యార్థుల భద్రత కోసం నిర్మల్ పోలీసుల అవగాహన

- సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ఏహెచ్‌టీయూ ప్రత్యేక అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం

సారంగాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో గల చించోలి(బి) జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు, శుక్రవారం జిల్లా ఎస్పీ డా. జి.జానకీ షర్మిల ఆదేశాల మేరకు షీటీమ్, భరోసా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, పోక్సో చట్టం షీ టీమ్ పని తీరు భరోసా సెంటర్ సేవలు, ఆన్‌లైన్ మోసాలపై మొబైల్‌లో తెలియని లింకులు, ఫ్రాడ్ అకౌంట్లు, డిజిటల్ హరాస్మెంట్ ఆన్‌లైన్ వేదింపులపై జాగ్రత్తలు, పాటించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, సుమాంజలి, షీటీమ్ సిబ్బంది, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసీల ధర్మ యుద్ధానికి తరలిరావాలి



కడెంలో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఆదివాసీ నాయకులు

కడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పట్టణంలోని ఎంపీడీవో గ్రౌండ్ వద్ద ఆదివారం ఉదయం నిర్వహించే ధర్మ యుద్ధం చలో ఉట్నూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర భీమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్పుల ముత్తన్న, కడెం మండల నాయకులు దూస లక్ష్మయ్య, కంతి రవీందర్, చీమల గంగన్నలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన కడెంలో ఆదివాసీల ధర్మ యుద్ధం సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న లాంబాడీ 1976 నుంచి ముందు వారికి ఎస్టీ హోదాలో ఎలాంటి హక్కులు లేవన్నారు. లంబాడీలు తెలంగాణలో రాజస్థాన్ నుంచి ఉప్పును అమ్ముకోవడానికి తెలంగాణకు వలస వచ్చారని తెగగా అవతరించడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం వీరు రాజస్థాన్, మహారాష్ట్ర రాష్ట్రాలలో బీసీలుగా చలామణి అవుతున్నారన్నారు. వీరిని తెలంగాణలో కూడా బీసీలుగా ప్రకటించి ఎస్టీ హోదా నుంచి లంబాడీలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 23న ఉట్నూర్‌లో నిర్వహించే ఆదివాసీల ధర్మ యుద్ధానికి ప్రతి గ్రామం నుండి ఆదివాసీలు తరలిరావాలని వారు కోరారు.

## ఉపాధ్యాయులకు టెట్ నుంచి

# మినహాయింపు ఇవ్వాలి

- పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు



బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

భైంసా రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో శుక్రవారం దేగాం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యులుగా బాధ్యతలు స్వీకరించిన కే.గంగాధర్‌ని సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు పాల్గొని మాట్లాడారు. దాదాపు 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పని చేస్తున్న వారికి టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వడానికి పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయడానికి శాసన మండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యాహక్కు చట్టం ప్రకారం 2010 సంవత్సరానికి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చే దిశగా రాష్ట్ర సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లు రెండు సంవత్సరాలు గడుస్తున్న మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని ప్రభుత్వం ప్రతి నెల 700ల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన హామీని కూడా విస్మరించారన్నారు. వెంటనే పెండింగ్ బిల్లు మంజూరు కోసం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు.


# విద్యారంగం బలోపేతం

- ప్రీ ప్రైమరీ పాఠశాలలకు నిధులు మంజూరు
- ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన
- ఒక్కో పాఠశాలలో మౌలిక వసతులకు రూ. 1.70 లక్షల చొప్పున నిధులు మంజూరు



ప్రైమరీ స్కూల్ పాండ్వాపూర్

ముథోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందేసింది. తాజాగా ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల కోసం బోధన సామగ్రి కొనుగోలు, తరగతి గదుల అలంకరణ, లెర్నింగ్ మెటీరియల్, ఆట వస్తువులు, మల్టీ మీడియా కిట్లు, శానిటేషన్ వంటి అవసరాల కోసం ప్రత్యేక నిధులను మంజూరు చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు ఆకర్షణీయమైన, శ్రద్ధ పెంచే విద్యా వాతా వరణం అవసరమని భావించి ఈ నిధులను విడుదల చేసినట్టు జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న తెలిపారు. సంబంధిత శాఖ మార్గదర్శకాల ప్రకారం ప్రతీ పాఠశాలకు అవసరానికి అనుగుణంగా నిధులు కేటాయించి చిన్నారులకు ఆట పాటలతో, చిత్రకార్డులతో, రైమింగ్ సెట్లతో, లెర్నింగ్ కిట్లతో నేర్పే 'ప్లే-వే' విధానం మరింత బలోపేతం కానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తొలి అడుగులు వేసే చిన్నారులకు నాణ్యమైన విద్యాబాటను మరింత సుగమం చేస్తుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రీ ప్రైమరీలో చేరే పిల్లలు నాలుగేళ్లు నిండిన వారై ఉండాలి. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలను ప్రీ ప్రైమరీకి తరలిస్తారు. ప్రీ ప్రైమరీ కోసం పాఠశాలలోనే ఒక గదిని కేటాయించి, గదిని ఆహ్లాదం పంచేలా అందంగా అలకరించడం, గోడలను అక్షరాలు, బొమ్మలతో చిన్నారులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దేందుకు ఈ నిధులు దోహదపడుతున్నాయి. ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే విషయాలపై సమావేశాలు నిర్వహిస్తారు.



పాఠశాలలో గోడలకు రంగులు వేసిన దృశ్యం

### నిర్మల్ జిల్లాలో 13 ప్రీ ప్రైమరీ పాఠశాలలు

నిర్మల్ జిల్లాలో 13 పాఠశాలలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేశారు. అయితే ఒక్కొక్క పాఠశాలకు రూ. 1.70 లక్షల చొప్పున నిధులు మంజూర య్యాయి. ప్రతీ పాఠశాలకు రూ. 1.70 లక్షల చొప్పున బోధన సామాగ్రి, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అవసరాల కోసం నిధులు మంజూరు చేసి నట్లు అధికారులు తెలిపారు.

### ఎంపికైన పాఠశాలలు...

నిర్మల్ రూరల్‌లో ముజ్గి, భాగ్యనగర్, నిర్మల్ అర్బన్‌లో మహాలక్ష్మి వాడ, కడెం మండలంలో పాండ్వాపూర్, సారంగాపూర్ మండలంలో యాకర్‌పెల్లి, కుంటాల మండలంలో లింబా (బి), భైంసా మండలంలో పెండ్‌పెల్లి, కుబీర్ మండలంలో నిగ్వా, తానూర్ మండలంలో బొందిరేట్, మసల్గా, లక్ష్మణచాంద మండలంలో చామన్‌పెల్లి, సోన్ మండలంలో కూచన్‌పెల్లి, నర్సాపూర్(జి) మండలంలో నర్సాపూర్ పాఠశాలలు ఎంపికయ్యారు.



ఆదిలాబాద్ ఏఎస్పీగా నియామకం అయిన మౌనిక

## ఆదిలాబాద్ ఏఎస్పీగా మౌనిక నియామకం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 32 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఏఎస్పీగా మౌనిక నియమితులయ్యారు. నల్గొండ జిల్లా దేవరకొండ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆమెను... ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్‌గా బదిలీ చేశారు. ఆదిలాబాద్‌లోని యాపల్‌గూడ రెండవ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిఖిత పంత్ ఆసిఫాబాద్ ఎస్పీగా నియమితులయ్యారు. బదిలీ అయిన అధికారులు త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.



మంటలు ఆర్పే విధానాన్ని చూపుతున్న ఫైర్ సిబ్బంది

## అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

ఇచ్చోడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఏలా ఆర్పాలి.. ఏలాంటి ప్రమాదం సంభవించకుండా ఉండాలంటే ఏం చేయాలి అనేది ఫైర్ ఆఫీసర్ ఎండీ షఫీ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని విద్యాలయ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మార శ్యాంరెడ్డి, ఫైర్ సిబ్బంది అచ్చుత్‌రెడ్డి, దెవేందర్, తేజ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## 24 వరకు సోయా, మొక్కజొన్న పంట కొనుగోళ్ల నిలిపివేత

బోథ్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో కొనుగోలు చేస్తున్న సోయాబీన్ మొక్కజొన్న పంటల కొనుగోళ్లను ఈ నెల 24 వరకు నిలిపి వేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జీ గోలిస్వామి తెలిపారు. మార్కెట్లో పంట నిల్వలు పేరుకు పోవడం వల్ల కొనుగోలు నిలిపి వేస్తున్నామని ఈ నెల 25న తిరిగి పంట కొనుగోలు ప్రారంభిస్తామన్నారు.



ఈశ్వర్‌నగర్ గ్రామంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్



గుడిహత్నూర్ మండలం నేరడిగొండ తండాలో మాట్లాడుతున్న స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్

# నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

» ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్ » ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వాహనాల తనిఖీ

ఇంద్రవెల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామంలో శుక్రవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కాజల్ సింగ్ మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం ప్రజలను అప్రమత్తం చేయడమే అన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రయాణించే సమయంలో వాహనాల అన్ని సర్టిఫికెట్లను వెంట ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, స్థానిక ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజల భద్రత కోసమే..

**గుడిహత్నూర్:** ప్రజల రక్షణ, భద్రత కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస అన్నారు. శుక్రవారం మండలంలోని నేరడిగొండ తండాలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ భద్రత చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఎవరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. రోడ్డుపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటికి దూరంగా ఉండాలని గంజాయి, గుడుంబా, లాంటివి జీవన విధానానికి ప్రాణహాని కలగజేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను రెండు ఆటోలను రెండు ట్రాక్టర్లను ఒక కారును తాత్కాలికంగా సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీలలో 8 లీటర్ల గుడుంబా లభ్యమైందని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సైలు శ్రీకాంత్, ఇమ్రాన్, పూజా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**బజార్‌హత్నూర్:** గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కాటన్ సెర్చ్ నిర్వహించామని ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలో పోలీసులు ప్రతీ ఇంటింటికి తిరుగుతూ శుక్రవారం తనిఖీలు చేస్తూ కాటన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలని వారు ఈ సందర్భంగా సూచించారు. అంతేకాకుండా వాహనాలకు సరైన ధ్రువ పత్రాలు అందుబాటులో ఉంచాలని, వాహనాల పత్రాలు అందించి వాహనాలు తీసుకెళ్లాలన్నారు. కాగా ఇందులో అనుమానస్పదంగా ఉన్న 44 బైకులను స్వాధీనపర్చుకుని పరిశీలించగా సరైన పత్రాలు లేని వాటి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ గురుస్వామి, ఎస్సై సంజయ్ కుమార్, సాయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ప్రేమ్ కుమార్, సిబ్బంది పాటిల్ విజయ్, విట్టల్, శ్రీధర్ రెడ్డి, ఘులే శిల్ప, బాజీలు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

» ఐటీడీఏ పీవోను కలిసిని పీవీటీజీ ఐక్యవేదిక

ఉట్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ఆదివాసీ కోలాం, తోటి గిరిజనులకు ఐటీడీఏ ద్వారా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందించాలని ఆదివాసీ పీవీటీజీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు టేకం వసంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ టేకం వినోద్‌లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీవో యువరాజ్ మర్మాట్‌ను కలిసి ప్రధాన కార్యదర్శి మేస్రం జైరామ్, గౌరవ జిల్లా అధ్యక్షులు వెడ్మశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చన్న, ప్రచార కార్యదర్శి నాగోరావ్, సహాయ కార్యదర్శి కుమ్రల క్ష్మణ్ తదితర నాయకులు కలిసి ప్రాజెక్టు ఆఫీసర్ యువరాజ్ మర్మాట్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, గృహ నిర్మాణం, మరియు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పీఓని కోరినట్లు వారు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సమానంగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్టీలు, అంగన్‌వాడీ టీచర్లకు, ఇతర చిన్న ఉద్యోగులకు కూడా ఇండ్లు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలపారు. ఈ సందర్భంగా అర్హులైన వారందరికి న్యాయం చేస్తామని పీఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ఐటీడీఏ పీవోను సన్మానిస్తున్న పీవీటీజీ ఐక్యవేదిక సభ్యులు



పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తూ..

## అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి: ఆదిలాబాద్ ఎస్పీ

(5వ పేజీ తరువాయి...)

ఆవరణను పరిశీలించి పరిశుభ్రతపై దృష్టి సారించాలని, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో చెట్లను నాటుతూ పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి స్థితిగతులను కేసు పరిస్థితిలను తెలుసుకున్నారు. పోలీసు సిబ్బందికి కేటాయించిన వస్తువులను వారి సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ కీలకమైనదని ప్రజల ధన,మాన, ప్రాణ రక్షణ బాధ్యతలను పోలీసు వ్యవస్థ చేపడుతుందని, దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడు పోలీసు కీర్తి ప్రతిష్టలు సమాజంలో ఉన్నత స్థాయికి చేరుతాయని తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని, గ్రామాలను సందర్శిస్తూ వారికి సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ క్లబ్, పోలీసు అక్క, మహిళల భద్రత, షీ టీం, ముఖ్యంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించాలని తెలిపారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ పూర్తి సమాచార సేకరణ చేపట్టి ప్రజల్లో మమేకం కావాలని తెలిపారు. నూతన ఆవిష్కరణలను తెలుసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసుల దర్యాప్తు పరిశోధనలు నిర్వహించాలని బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల బాధ్యతగా వ్యవహరించి సిబ్బందిని కేటాయించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎంతటి వారినైనా ఉపేక్షించకూడదని తెలిపారు. బాధితులకు అండగా పోలీసు వ్యవస్థ ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సాయంత్రం సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డు కట్టవేసేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డులను ప్రశంస పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్సై వి.విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.



● విద్యార్థిని రూపను సన్మానిస్తున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి కె.పార్థసారథి

## జాతీయ ఆర్చరీ పోటీలకు రూప ఎంపిక

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చెంచుఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రూప జాతీయ స్థాయిలో ఆర్చరీ క్రీడలకు ఎంపికయ్యింది. శుక్రవారం జిల్లా గిరిజన క్రీడల అధికారి కె.పార్థసారథి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్చరీలో భవిష్యత్తు జిల్లా ఆశా కిరణంగా పెందుర్ రూప నిలుస్తుందన్నారు. ఇప్పటికే కోచ్ కోతిలే మారుతి ఆధ్వర్యంలో పలుమార్లు రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ తరపున ఆమె మరింతగా రాణించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని తెలిపారు. డిసెంబరు రెండో వారంలో వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ ప్రేమ్ దాస్, కనక అభినవ్, దీపక్, రజిత, నగేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద గల సంఘ భవనం నుంచి ర్యాలీని చేపట్టారు. ర్యాలీలో వల, చేపలు పట్టే సామగ్రిని ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఏడీ భాస్కర్ మాట్లాడుతూ.. మత్స్యకారుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారికంగా మత్స్యకార దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో మత్స్యకారుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఫలాల గురించి తెలియజేస్తామని, వాటిని తెలుసుకుంటు వినియోగించుకోవాలని కోరారు. చేపలు తినడం ద్వారా ఆరోగ్యంతో పాటు గంగపుత్రులకు జీవన ఉపాధి కూడా లభిస్తుందని సంఘం అధ్యక్షుడు భోజన్న తెలిపారు. పథకాలను గంగపుత్రులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ప్రగతిశీలత సాధించాలని సూచించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, గంగపుత్రులు పాల్గొన్నారు.

## సాంగిడిలో ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంగిడిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రబియా, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు జాడే సుదర్శన్, రాజేశ్వర్, రఘునాథ్, తదితరులు హాజరయ్యారు. పౌష్టిక ఆహారం తినడం వల్ల కలిగే లాభాలను సవివరంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.అశోక్, ఉపాధ్యాయులు ఎస్.సంతోష్, పి.నారాయణలను అభినందించారు.

## చైల్డ్ హెల్ప్‌లైన్ సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో సమాజానికి నష్టం ఉందని, అందుకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098ని సద్వినియోగం చేసుకోవాలని డిహెచ్ఈడబ్ల్యూ ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ కాలేజీలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ మిషన్ శక్తి మహిళా సాధికారతలో భాగంగా చైల్డ్ మ్యారేజ్‌లపై 30 రోజుల క్యాంపెన్ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాలను విద్యార్థులకు ఈ సందర్భంగా వివరించారు. 1098కు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయాని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో షూర్ సంస్థ మండల కోఆర్డినేటర్ నారాయణ, ప్రిన్సిపాల్ సంగీత, టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగాలి

(5వ పేజీ తరువాయి....)

లచ్చిరాం, ఏఎస్‌వో గోవర్ధన్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్, జిల్లా అధ్యక్షులు దండ నాయక ఉమాకాంత్, లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కర్ పాల్గొన్నారు.

**బోథ్ రూరల్:** మండల స్థాయి చెక్‌ముఖి సైన్స్ టాలెంట్ టెస్టు 2025కు సంబంధించిన ప్రశ్న పత్రాలను శుక్రవారం బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన సైన్స్ టాలెంట్ ప్రశ్న పత్రాలను, పాఠశాల ఉపాధ్యాయులు గజ్జపల్లి నరసయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యతను శాస్త్రీయ వైజ్ఞానిక అంశాలను పోటీ పరీక్షలను ఏవిధంగా సన్నద్ధం కావాలనే విషయాలపై అవగాహన కలిగించేందుకు ప్రతీ సంవత్సరం పరీక్షలను మండల, జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 8, 9, 10వ తరగతిలో విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ మీడియం పరీక్షలు రాయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

**తాంసి:** మండల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాంసిలో నిర్వహించారు. ఈ పోటీలలో తాంసి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అదేవిధంగా కప్పర్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారు. అయితే, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 28న నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పాఠశాల నిర్వాహకులు ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ పోటీలు ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రాజశేఖర్, తదితరులు పాల్గన్నారు.

**గుడిహత్నూర్:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గుడిహత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. అంతకు ముందు ప్రశ్న పత్రాలను ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యత పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఎం దేవిదాస్, కన్వీనర్ యు.గంగన్న, ఉపాధ్యాయులు శివాజీ, నిరూప, సవిత, చంద్రకళ తదితరులున్నారు.



బోథ్ ప్రభుత్వ పాఠశాలలో ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



గుడిహత్నూర్‌లో ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో

## నాణ్యమైన విద్య అందించేందుకు ప్రణాళికలు సిద్ధం



బోథ్‌లో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జీ విద్యాధికారి ఎస్.రాజేశ్వర్

బోథ్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో నాణ్యమైన విద్య అందించేందుకు గాను త్వరలోనే ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ డీఈవో ఎస్.రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవవారం బోథ్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు హాస్టళ్లలో వసతుల కల్పనపై దృష్టి సారిస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యా బోధనతో పాటు వివిధ హాస్టల్లో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్లో నాణ్యమైన భోజనంతో పాటు విద్యార్థుల వసతులు, విద్యాబోధన పర్యవేక్షణకు మండల స్థాయి కమిటీలను వేయడం జరుగుతుందన్నారు. అందులో మండల విద్యాధికారితో పాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోఆర్డినేటర్ స్పెషల్ ఆఫీసర్‌గా ఉంటారని, ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులపైన ప్రత్యేక దృష్టి సారించే విధంగా చూడడం జరుగుతుందన్నారు. త్వరలోనే అన్ని పాఠశాలు, హాస్టళ్లలో పర్యవేక్షణ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలి

సిరికొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహా సభ జిల్లా కమిటీ సభ్యులు, సిరికొండ మండల ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి పెంటన్న డిమాండ్ చేశారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవం, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం మండలంలో ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించి, వాల్ పోస్టర్‌లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి విజయ్ కుమార్, ముదిరాజ్ కులస్తులు ఎగ్గిడి మల్లారెడ్డి, ఓరుగంటి నర్సింలు, ఎగ్గిడి ఇస్తారీ, కంచం రమేష్, శాగంటి అశోక్, పసి అశోక్, శ్రీనివాస్, మహేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బృందం సభ్యులను ఆహ్వానిస్తున్న విద్యార్థినులు

## పీఎంశ్రీ నిధుల వినియోగంపై పరిశీలన

బోథ్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు గతఏడాది మంజూరు అయిన పీఎంశ్రీ నిధుల వినియోగంపై శుక్రవారం కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారి ప్రీతిమీనా మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కేంద్ర బృందం అధికారులతో కలిసి పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా అధికారిని జిల్లా సంయుక్త కలెక్టర్ ఇన్‌చార్జీ విద్యాధికారి ఎస్.రాజేశ్వర్ పుష్పగుచ్ఛం అందించారు. ఆ తర్వాత గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీతతో పాటు పీఎంశ్రీ విభాగ పరిశీలకుడు గూడెం రఘురమణ, మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్‌తో కలిసి స్వాగతించారు. అనంతరం విద్యార్థులు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించారు. కేంద్ర బృందం అధికారి మీనా మాట్లాడుతూ ప్రభుత్వం పరంగా వచ్చిన నిధులను సరైన రీతిలో వినియోగించి పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న నిధులతో తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను వారి భవిష్యత్తు ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఉన్న వసతులను పరిశీలించడం జరిగింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఏ ఏ పనులకు వినియోగించుకున్నారు? అనే విషయాన్ని అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట గురు ప్రీత్‌కౌర్ కన్సల్టెంట్ టీ ప్రభుదాస్, కేవీఎస్ పి.రాజీవ్, జేడీఎస్ ఎస్ జావిద్, స్టేట్ కోఆర్డినేటర్, తదితరులున్నారు.

## వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

» ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



కొండాపూర్ వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సిరికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరికొండ నుంచి ఇంద్రవెల్లికి వెళ్లే మార్గంలో కొండాపూర్ గ్రామం వద్ద చిక్మాన్ వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణంలో నాణ్యత పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ చైర్మన్ షేక్ రంజానీ, నాయకులు ఆలం, తదితరులు ఉన్నారు.

**సిరికొండ:** రాష్ట్రంలోని ప్రతీ మహిళ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులందరికీ ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ గణేష్, పార్టీ నాయకులు షేక్ రంజానీ, ఆలం, తదితరులున్నారు.

**ఇంద్రవెల్లి:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయ మాజీ చైర్మన్ మెస్రం నాగు, తొడసం ప్రభుదాస్, పెందోర్ రాంభాబాయి బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. శుక్రవారం వారి ఇంటికి వెళ్లి మెస్రం నాగు, తొడసం ప్రభుదాస్, పెందోర్ రాంభాబాయి చిత్రపటాల వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్, మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్, తదితరులున్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

» వేణునగర్ గ్రామస్థుల ఆవేదన



మాట్లాడుతున్న వేణునగర్ గ్రామస్థులు

పెంబి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేణు నగర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వేణునగర్ గ్రామంలో బాధిత కుటుంబ సభ్యుల కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ చిన్నారి పుష్ప ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పిల్లర్ గుంతలో పడి మృతి చెందిందని, ఈ నెల 1వ తేదీన అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి నిర్మానం పిల్లర్ గుంతలో పడి పుష్ప మృతి చెందిందన్నారు. ఇన్ని రోజులు అయిన అధికారులు అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవడం లేదని, బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందిస్తలేరని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో చిన్నారి మృతి చెందిందని, టీచర్ నాగలక్ష్మిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఐసీడీఎస్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## నాణ్యమైన సోయా కొనుగోలు



కుంటాలలో సోయాలను పరిశీలిస్తున్న నాఫెడ్ అధికారులు

కుంటాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన నాణ్యతతో కూడిన సోయాలను మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు నాఫెడ్ అధికారులు పేర్కొన్నారు. కుంటాల మండలంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేపడుతున్న సోయాలు నాణ్యతగా లేవని ఇటీవల అధికారులు గోదాం నుంచి లారీని వాపసు పంపగా రైతులు గత మంగళవారం రోజు రోడ్డుపై ధర్నా నిర్వహించడంతో మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ వచ్చి నాఫెడ్ అధికారులచే కొనుగోలు కేంద్రంలోనే సోయాలను పరిశీలించిన అనంతరం గోదాంకు తరలిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రం కుంటాల సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేపడుతున్న సోయా కేంద్రాన్ని వారు పరిశీలించి రైతుల నుంచి ఇది వరకే శుద్ధి చేసి తూకం చేసిన సోయాలను వారు పరిశీలించారు. దాదాపు 50 మంది రైతుల నుండి ఇది వరకే సహకార సంఘం సిబ్బంది కొనుగోలు చేసి గోదాంకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. అయితే అక్కడి నుంచి వచ్చిన అధికారులు సహకార సంఘం సిబ్బంది కొనుగోలు చేసిన సోయాలు నాణ్యతగా లేవని వాటిని మరోమారు జల్లెడచే శుద్ధి చేస్తే తప్ప నాణ్యతగా లేవని గోదాంకు పంపించాలంటే మరోమారు శుద్ధి చేసి గోదాంకు పంపాలని అధికారులు తెలిపినట్లు సహకార సంఘం సిబ్బంది పేర్కొన్నారు

## ఉపాధ్యాయులకు శిక్షణ

కుంటాల, నవంబరు, 21 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాధికారి ముత్యం కుంటాల మండలంలోని ఆయా ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు బోధన, అభ్యాసన కార్యక్రమాల్లో విద్యార్థులు ఆసక్తికరమైన బోధనను అందించాలని పేర్కొన్నారు. అంతేగాకుండా ఫిబ్రవరి నెలలో జరగబోయే జాతీయ స్థాయి ఫౌండేషనల్ లర్నింగ్ స్టడీకి 3వ తరగతి విద్యార్థిని, విద్యార్థులను సిద్ధం చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సాపూర్(జి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం తురాటి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో (ఇందిరా క్రాంతి పథం) రైతులకు మేలు చేసే విధంగా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. తురాటి మాక్స్ (పీఏసీఎస్) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకోవచ్చు. ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐకేపీ, ఇతర అధికారులు ఏపీఎం గంగామణి, సీసీలు ముత్యం, లావణ్య, కవిత, వీవో, ఓబీ ప్రతినిధులు సరిత, మమత, సుజాత, వీవోఏ ప్రతినిధులు రంజిత్, సాయన్న, ప్రవీన్, రైతులు రాజేందర్ రెడ్డి, శ్యాంసుందర్, రవి, సురేష్, చిన్నారెడ్డి, కిరణ్, చిన్న భూమన్న, పాపన్నతో పాటు పలువురు రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కేంద్రం ప్రారంభంతో తురాటి గ్రామం, చుట్టు పక్కల ప్రాంతాల రైతులకు తమ పంటకు మద్దతు ధర పొందేందుకు మార్గం సుగమమైంది. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## ఘనంగా జెండా ఆవిష్కరణ

కుంటాల, నవంబరు, 21 : (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రం కుంటాల లింబా (కే) గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, మత్స్య కారుల దినోత్సవం పురస్కరించుకొని జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మోల సాయిలు, మాజీ సర్పంచ్ ఆనంద్ రావు, మాజీ ఆత్మ చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గిరిష్‌తో పాటు పలువురు గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# కదం తొక్కిన పత్తి రైతులు

» సమస్యలు పరిష్కరించాలంటూ జాతీయ రహదారిపై బైఠాయింపు

» హైదరాబాద్ - నాగ్‌పూర్ హైవేపై నిలిచిపోయిన రాకపోకలు

ఆదిలాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ పత్తి రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలంలో జాతీయ రహదారిపై బైఠాయించి దిగ్బంధం చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి భారీ ఎత్తున రైతులు తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. హైదరాబాద్ - నాగపూర్ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డు పైననే రొట్టెలు తింటు రైతులు వినూత్న నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడు తూ సీసీఐ విధించిన 7 క్వింటాళ్ల పరిమితి, నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే కపాస్ కిసాన్‌యాప్ ఎతో పాటు బయోమెట్రిక్ విధానాన్ని తొలగించాలన్నారు. సీసీఐ విధిస్తున్న కఠినమైన నిబంధనల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తేమ శాతాన్ని 20 నుంచి 22 శాతానికి పెంచాలని కోరారు. ఇంత జరుగుతున్న బీజేపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే,ఎంపీ కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావడం లేదన్నారు. మాయమాటలు చెప్పి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. పంట కొనుగోళ్లకు కొర్రీలు పెట్టడంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ పాల్గొన్నారు.



రహదారిపై బైఠాయించి రొట్టెలు తింటున్న మాజీ మంత్రి జోగు రామన్న

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముథోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్ మండలంలోని తరోడా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించి, గిట్టుబాటు ధర కల్పించుట కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సన్నరకం ధాన్యంకు ప్రభుత్వం నుంచి వచ్చే బోనస్ డబ్బులు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. 28 ప్యాకేజీ పనులు ముందుకు సాగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సీఎం నుంచి హామీ లభించిన వెంటనే 28 ప్యాకేజీ పనులు ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. తాను ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ 28 ప్యాకేజీ పనులు పూర్తయ్యేంత వరకు నిరంతరం చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఏపీఎం గురుచరణ్, ఏవో రచన, మాజీ ఎంపీటీసీలు బండారి గంగాధర్, ఆత్మ స్వరూప్, నాయకులు విశ్వనాథ్ పటేల్, సతీష్ రెడ్డి, రమేష్, నర్సాగౌడ్, రాము, సాయి, తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూముజ్గి గ్రామంలో నానో యూరియా పైన ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ వివిధ మార్గాల్లో వెళ్తూ గ్రామ పంచాయతీ వరకు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి హాజరై మాట్లాడారు. రైతులు సంప్రదాయ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ నానో యూరియా వాడి ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పంటల సాగులో పశువుల పేడ సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, వ్యవసాయ అధికారి వసంత్ రావు, విస్తీర్ణ అధికారులు అంబాజీ, రజిని, లావణ్య, శాస్త్రవేత్తలు కార్తీక్, దినేష్, నాయకులు మల్లేష్, సంతోష్, ఆత్మ డైరెక్టర్ రవి, ఎఫ్ఎస్ సీఎస్ డైరెక్టర్ నాగేంద్ర, ఎరువుల డీలర్లు, ఐఎఫ్ఎఫ్ సీవో మేనేజర్ బాల వికాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఏఈని నియమించాలి

కడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలానికి రెగ్యులర్ విద్యుత్ శాఖ ఏఈని కేటాయించాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ నిర్మల్‌కు రాష్ట్ర బీసీ యువజన ప్రధాన కార్యదర్శి సౌధాని రమణ యాదవ్ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ... కడెం, ఖానాపూర్ విద్యుత్ శాఖ ఏఈ ఒక్కరే ఉండడం వలన సమస్యలు పరిష్కాం అవ్వడం లేదని దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభి లాష అబినవ్, జిల్లా డీఆర్డీవో విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల నిర్మల్ జిల్లాకు లభించిన జల సంచాయ్ - జన భాగీదారి అవార్డు రావడం సంతోష దాయకమని పేర్కొన్నారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

### అభినందించిన కాంగ్రెస్ మండల నాయకులు

లక్ష్మణచాంద, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తరపున నిర్మల్ తరపున (జల సంరక్షణ నీటి సద్వినియోగం) జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాలలో ఉత్తమ జల సంచాయ్ - జన భాగీదారి పురస్కారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ని లక్ష్మణచాంద కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం అభినందించారు. పూల గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకపోతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొజ్జ అశోక్, నాయకులు శేఖర్ రెడ్డి, బొంగురాల మల్లేష్, ఎరకారి నరేష్, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

నర్సాపూర్(జి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రోజున ఘనంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముథోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై, అర్హులైన 10 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ... పేదింటి ఆడబిడ్డల పెళ్లి ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు.

## కొనసాగుతున్న చలి తీవ్రత

» బజార్‌హత్నూర్‌లో అత్యల్పంగా 9.1 ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో చలితీవ్రత కొనసాగుతుంది. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో చలి ప్రభావం కనిపిస్తుంది. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3 కా గా కనిష్ఠంగా 10.2 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 9.1, బోథ్ మండలం పొచ్చెరలో 9.9, సోనాలలో 10.6, నేరడిగొండలో 10.7, తాంసిలో 10.8, ఇచ్చో డలో 10.9, ఆదిలాబాద్‌అర్బన్‌లో 11.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లా వ్యాప్తం గా 20 డిగ్రీలలోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలితీవ్రత మరింతగా పెరిగి పోతుంది. వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు చలితో వణికి పోతున్నారు. సీ జనల్ వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. ము ఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు చలితో అప్ర మత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ద ట్టమైన పొగమంచుతో ఉదయం వేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సాయంత్రం 5గంటల లోపే వ్యవసాయ పనులను ముగించుకుని రైతులు ఇంటికి చేరుకుంటున్నారు.



ఆదిలాబాద్‌ను మంచుతో కప్పేసిన దృశ్యం

## క్రైం సమాచారం

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉట్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షాంపూర్ వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎంద గ్రామానికి చెందిన రైతు రామ్‌కుమార్ నర్సాపూర్‌కు చెందిన మాన్సింగ్ ఆటోలో ఎక్స్‌రోడ్డులో జరిగే మార్కెట్‌కు వస్తుండగా ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బొలెరో ప్యాసింజర్ వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఆటో నుజ్జు నుజ్జు అయింది. అదుపు తప్పిన జీపు రోడ్డు కిందకి వెళ్లి ఆగింది. ఆటోలో ప్రయాణిస్తున్న రామ్‌కుమార్‌తో పాటు ఆటో డ్రైవర్ మాన్సింగ్, అతని భార్య, కుమారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉట్నూర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించిన ఇజిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అధిక గాయాలైన రామ్‌కుమార్‌ను డాక్టర్ సలహా మేరకు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించామని రామ్‌కుమార్ తండ్రి బాలాజి తెలిపారు. ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షాంపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

### అక్రమంగా తరలిస్తున్న కలప వాహనం పట్టివేత

బోథ్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని మరలపెల్లి గ్రామం నుంచి అక్రమంగా తీసుకువస్తున్న అక్రమ కలప వాహనాన్ని అటవి శాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా కలప తీసుకువస్తున్నారన్న పక్కా సమాచారంతో అటవి శాఖ అధికారులు గురువారం రాత్రి మరలపెల్లి రూట్ లో ప్రణాళిక ప్రకారం వాహనాన్ని పట్టుకున్నారు. అనంతరం బోథ్ రేంజ్ అధికారి కార్యాలయంలో ఉంచారు. పాత ఇండ్లను ఉంచి వేసి నిలువ ఉంచిన కర్రను నిర్మల్ తరలిస్తున్నారని సమాచారంతో పట్టుకోవడం జరిగింది.



అటవి శాఖ కార్యాలయంలో నిలిపి ఉంచిన కలప వ్యాన్

### ఒకరిపై వేధింపు కేసు నమోదు

తానూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒకరిపై శుక్రవారం వేధింపు కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై హన్మాండ్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జౌల(కే) గ్రామంలో మహిళను వేధించినందుకు గాను సదరు మహిళ ఫిర్యాదుతో గాడేకర్ ఆనంద్‌పై కేసు నమోదు చేశామన్నారు. బాధిత మహిళ భర్త గత మూడేళ్ల క్రితం మృతి చెందగా, వరసకు బంధువైన గాడేకర్ ఆనంద్ అనే వ్యక్తి మహిళను తమతో మాట్లాడాలని కొంతకాలంగా వేదిస్తున్నాడని, ఈ విషయాన్ని మహిళ తమ కుమారుడు ఓంకార్‌తో చెప్పింది. ఈ విషయమై గురువారం రాత్రి ఓంకార్, ఆనంద్‌ల మధ్య మాటమాట పెరిగి గురువారం రాత్రి గొడవకు దారి తీసింది. శుక్రవారం బాధితురాలు మహిళ ఆమే కుమారుడు ఓంకార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆనంద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా వెల్లడించారు.

### పేకాట స్థావరంపై దాడి

నర్సాపూర్(జి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 19న నందన్ గ్రామ శివారులో జరిగిన పేకాట స్థావరంపై దాడికి సంబంధించిన దర్యాప్తు కేవలం ఇద్దరు వ్యక్తుల అరెస్ట్‌తోనే ఆగిపోలేదు. కేవలం రూ. 2,900ల నగదు మాత్రమే లభించడం, ఎండీ ఫిరోజ్ ఖాన్, షేక్ ముజామిల్, గుమ్ముల సురేష్ శశిధర్, ఆసిఫ్, నవీన్ రెడ్డి అనే ఆరుగురు వ్యక్తులు పరారీలో ఉండటం లాంటి కీలక అంశాలపై పోలీసులు లోతుగా దృష్టి సారించారు. పోలీసులు ఈ అక్రమ కార్యకలాపాల వెనుక ఉన్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఛేదించడానికి తమ దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. శుక్రవారం పరారైన వారితో పాటు తోట యజమానిని పిలిపించి విచారణ జరిపారు.

### పరామర్శ

తానూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్ మాజీ సర్పంచ్ మాధవరావు పటేల్ తమ్ముడు శివానంద్ ఇటీవల మృతి చెందాడు. కాగా విష యం తెలుసుకున్న ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ నారాయణ్‌రావుపాటిల్ ఆయనను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తానూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుండలిక్, సదాశివపటేల్, గోవింద్‌రావుపటటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌చంద్ర, తానూర్ మాజీ ఎంపీపీ చంద్రకాంత్, హనుమత్‌పటేల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఖో ఖో పోటీలకు గురుకుల విద్యార్థి

ముథోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన రాజేశ్వర్ (ఫస్ట్ ఇయర్ ఎం పీసీ) అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కే. వెంకటేష్ తెలిపారు. ఇటీవల ఉట్నూర్ జోనల్ స్థాయి ప్రతిభ కనబరిచి, భువనగిరి, యాదాద్రి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈయన పాల్గొంటాడని తెలిపారు. పీఈటీ సంజీవ్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు రవి కుమార్, సురేష్ విద్యార్థిని అభినందనలు తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## ఓటు హక్కు వినియోగించుకోవాలి

కుంటాల, నవంబరు 21: (ఆం ధ్రజ్యోతి): త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై అశోక్ అన్నారు. శుక్రవారం రాత్రి కుంటాల మండలంలోని విట్టాపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలలో ప్రజలు ఎలాంటి గొడవలకు తావీయకుండా ఎన్నికలు జరుపుకోవడంతో పాటు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అంతేగాకుండా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానితులు ఫోన్‌చేసి పోలీసుల పేరు చెప్పి మోసానికి గురి చేస్తున్నారని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జీవన్ రావు, పోలీసులు ఉన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా విజ్ఞ తేజ

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన పత్తి విజ్ఞ తేజ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ కాల్వ సుజాత గుప్తా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆర్యవైశ్యులకు చేరేలా కృషి చేస్తానని అన్నారు.

## అయ్యప్ప పడి పూజ

సారంగాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గలదని గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు శుక్రవారం అయ్యప్పపడి పూజను చేశారు. ఈ నేపథ్యంలో చేనిగారపు చిన్నయ్య గురుస్వామి అయ్యప్ప పూజ చేయగా స్వాములు భజన కీర్తనలు పడుతూ నృత్యాలను చేశారు.

## వైభవంగా పంచముఖి ఆంజనేయ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

» రేపటి వరకు సాగనున్న వేడుకలు

ఖానాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో పంచముఖి ఆంజనేయ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ యజ్ఞం శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ వేడుకలు ఈ నెల 23వ తేదీ వరకు మూడు రోజులపాటు కొనసాగ నున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు ఖానాపూర్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి పట్టణ శివారులోని పంచముఖి క్షేత్రం - హనుమాన్ జంక్షన్ వరకు విగ్రహ శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం పంచముఖి క్షేత్రంలో మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, నాంది తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజతో ప్రత్యేక పూజా కార్య క్రమాలు ప్రారంభం కానున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 23వ తేదీన గణపతి పూజ, విగ్రహ ప్రతిష్ఠ హోమం, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పంచముఖి ఆంజనేయ క్షేత్ర కమిటీ బృందం తె లిపింది. ఈ క్షేత్రంలో ఏర్పాటు చేయనున్న పంచముఖి ఆంజనేయ విగ్రహాన్ని ఖానాపూర్‌కు చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం శైలజ దంపతులు విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు. క్షేత్ర ప్రాంగణం లో రాజురా సత్యం, శైలజ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



విగ్రహ దాత మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం శైలజ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ బృందం

## ఎన్నికల నిబంధనలపై అవగాహన

గొల్లమాడలో ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో సదస్సు

నర్సాపూర్(జి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లమాడ గ్రామంలో స్థానిక ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్‌పై ఎస్సై గణేష్ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం జరగాలని ఆయన కోరారు. ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని, ప్రభుత్వ స్థలాలపై పోస్టర్లు అతికించరాదని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని తెలిపారు.



గొల్లమాడ లో అవగాహన సదస్సులో ఎస్సై గణేష్





ఎమ్మెల్యే బొజ్జుకు వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌గోండు ప్రతినిధులు



మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

## రేపు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న పట్టణంలోని వీఎస్ఆర్ అకాడమీలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని టీసీఏ రాష్ట్ర కమిటీ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి తెలిపారు. శుక్రవారం కైలాసనగర్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు జోనల్, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అదే విధంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జరుగుతున్న అవినీతిని ఆధారలతో సహా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిరూపించిందన్నారు. హెచ్‌సీఏ అంటే కేవలం హైదరాబాద్ వారి కోసమే అన్నట్టుగా ఉండేదన్నారు. అక్కడ జరు



జిల్లాకేంద్రంలో కమ్ముకున్న పొగమంచు

## జిల్లాలో కొనసాగుతున్న చలి గాలుల ప్రభావం

» బజార్‌హత్నూర్‌లో అత్యల్పంగా 9.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత

(7వ పేజీలో..)

పదేళ్ల తర్వాత అధికారానికి దూరమైన కారు పార్టీ నేతలు ప్రజల మధ్య ఉండేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రధానంగా రైతు సమస్యలే ఎజెండాగా ముందుకెళ్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా.. వదిలి పెట్టకుండా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీని ఇరుకున పెట్టేందుకు ఎదురుదాడికి దిగుతున్నారు. రాజకీయాల్లో సుధీర్ఘ అనుభవం ఉన్న మాజీమంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ల ఆధ్వర్యంలో పలుకార్యక్రమాలు, నిరసనలు,ఆందోళనలు చేపడుతున్నారు.



# కారు.. దూకుడు

## స్పీడ్ పెంచిన గులాబీ పార్టీ శ్రేణులు

» జిల్లాలో అధికార పార్టీకి ధీటుగా బీఆర్ఎస్ కార్యక్రమాలు, ఆందోళనలు
» కేటీఆర్ జిల్లా పర్యటనతో మారిన పొలిటికల్ సీన్
» రైతు సమస్యలే ఎజెండాగా నిరంతర పోరాటాలు
» స్థానిక ఎన్నికలపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్

ఆదిలాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోళ్లపై గత కొద్ది రోజుల క్రితమే ఎంపీ గోడంనగేష్ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో మార్కెట్ యార్డును ముట్టడించారు. దీనిని మరిచి పోక ముందే తాజాగా బోరజ్ మండలం వద్ద జాతీయ రహదారిపై అఖిలపక్షం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆందోళనకు దిగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అసలు తగ్గేదే లేదంటూ అధికార పార్టీకి ధీటుగా పలు ఆందోళనలను చేపడుతు జిల్లా రాజకీయాలను హీటెక్కిస్తోంది. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఓటమితో నిరాశ చెందకుండా బీఆర్ఎస్ నేతలు రైతుల సమస్యలను భుజాన వేసుకుని ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లో పార్టీ పటిష్టంగానే కనిపిస్తుంది. అయినా పార్టీ క్యాడర్ చేజారీ పోకుండా నేతలు జోష్ నింపేందుకు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుచూపుతో అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. కాని కారు పార్టీకి స్థానిక ఎన్నికలు కలిసి వస్తాయో రావోనన్న టాక్ వినిపిస్తుంది.

### పక్కా వ్యూహం

అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలే టార్గెట్‌గా బీఆర్ఎస్ పక్కా వ్యూహంతో ముందుకెళ్తుంది. ఎంపీ, ఎమ్మెల్యేల పని తీరును ప్రజల్లోకి తీసుకెళ్తునే ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతుంది. బీఆర్ఎస్ వరుస ఆందోళనలు, నిరసనలతో మళ్లీ ఉద్యమ కాలం నాటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించని బీఆర్ఎస్ ప్రధానంగా రైతుల సమస్యల పైననే దృష్టి సారిస్తుంది. పత్తి, సోయా కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వస్తుంది. ఇటీవలే జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జిల్లాలో పర్యటించారు. ఆ వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లా టూర్ వెనుక అసలు అంతర్యమేమిటన్న వాదనలు వినిపిస్తున్నాయి. క్యాడర్ చేజారీ పోకుండా జాగ్రత్త పడిన బీఆర్ఎస్ కేటీఆర్ పర్యటనతో పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న రాజకీయ పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకునేందుకే బీఆర్ఎస్ రాజకీయ ఎత్తుగడలను వేస్తుందన్న టాక్ వినిపిస్తుంది.

### వలసలకు బ్రేక్

జిల్లాలో బలంగా కనిపిస్తున్న బీఆర్ఎస్ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంది. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలిచేందుకు పట్టుతో కనిపిస్తుంది. కల్వకుంట్ల కవిత జిల్లా పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నుంచి భారీగా వలసలు ఉంటాయని అందరు భావించారు. కానీ అలాంటి పరిస్థితికి అవకాశం లేకుండా బీఆర్ఎస్ అడ్డుకట్ట వేయగలిగింది. జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ తప్ప ఇతర నేతలెవరు జాగృతి వైపు ఆసక్తిని చూపించలేదు. ఆ వెంటనే కేటీఆర్ జిల్లాలో పర్యటించడంతో పొలిటికల్ సీన్ పూర్తిగా మారిపోయింది. బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపడంతో పోటీపడి మరి ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరేపిన జిల్లాలో పెద్దగా వలసలు కనిపించడం లేదు. ఆదిలాబాద్‌లో కొంత మంది ముఖ్య నేతలు పార్టీ మారిన బోథ్ నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ కొంత బలంగానే కనిపిస్తుంది.

### రైతు చుట్టే రాజకీయం....

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం ఖాయమని తేలిపోవడంతో బీఆర్ఎస్ రైతుల సమస్యలే ప్రధాన ఏజెండాగా పోరాటాలు చేస్తుంది. ముఖ్యంగా పంట నష్ట పరిహారం, పంటలబీమా తదితర అంశాలతో రైతుసమస్యల పై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు.ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగురామన్న, బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. స్థానిక ఎన్నికలు దగ్గర పడడంతో బలమైన నేతలను బరిలోకి దింపేందుకు సిద్దమవుతున్నారు.ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిస్తుంది. బీఆర్ఎస్ చేస్తున్న ఆందోళనలు, పోరాటలు, నిరసనలు మొత్తం రైతుచుట్టే అన్నట్లుగా కనిపిస్తున్నాయి.కాంగ్రెస్, బీజేపీ నేతల పని తీరు పై విమర్శలకు దిగుతునే రైతు సమస్యల పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

## 'గోండ్వానా' అభివృద్ధికి కృషి చేయాలి

» రాజ్‌గోండ్ సేవా సమితి

ఉట్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గోండ్వానా దేవస్థానాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉత్తర్వులు తెచ్చేలా కృషి చేయాలని రాజ్‌గోండు సేవా సమితి ప్రతినిధులు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గోండ్వానా దేవతల అభివృద్ధి కోసం కటోడాలు, పూజారులు,దూపదీప నైవేద్యం కొరకు మధ్యప్రదేశ్‌లో జీవో వచ్చిందని, ప్రభుత్వం కూడా జీవో తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలోగోండ్వానా గోండు మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జు, రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావు, కుంరంభీం జిల్లా రాయిసెంటర్ జిల్లా మేడి కుర్సెంగ మోతిరాం, రాజ్ గోండు సేవా సమితి జిల్లా సంయుక్త కార్యదర్శి మడావి నర్సింగ్‌రావు, గిన్నెదరి సార్‌మేడి అడతాను, ఉట్నూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మడావి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మయుద్ధం సభకు తరలి రావాలి : టేగం

ఉట్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉట్నూర్‌లో నిర్వహిస్తున్న ధర్మ యుద్ధ సభకు పీవీటీజీ గిరిజనులు భారీగా తరలిరావాలని పీవీటీజీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు టేగం వసంతరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టేకంవినోద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేస్రం జయరాంలు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉట్నూర్‌లోని ఎంపీడీవో గ్రౌండ్‌లో నిర్వహించనున్న ధర్మయుద్ధం సభకు ప్రతీ ఇంటి నుంచి తరలి రావాలన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణలో ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలి

» సమీక్షా సమావేశంలో రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి » పాల్గొన్న ఆదిలాబాద్, నిర్మల్ అధికారులు




మాట్లాడుతున్న రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి సరదాగా మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల బాలల భద్రత, బాల్య వివాహాల నియంత్రణ, పోక్సో చట్టం అమలు, చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థపై అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ రాజర్షిషా కమిషన్ చైర్ పర్సన్‌కు సాధరంగా స్వాగతం పాలికారు. అనంతరం కమిషన్ చైర్ పర్సన్‌తో పాటు.. సభ్యులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పిల్లలకు రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవంతో జీవించే హక్కులు ఉన్నాయని, వారి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజం మొత్తం పాలుపంచుకోవాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటికీ బాల్య వివాహాలు నమోదవడం ఆందోళనకరమని, వాటి గురించి సమాచారం వచ్చిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని, బాల్య వివాహ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. హాస్టళ్లు, ఆశ్రమాలు, పాఠశాలల్లో పిల్లలపై వేధింపులు, దుర్వినియోగం, నిర్లక్ష్యంపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో పిల్లలు సైబర్ మోసాలు, అనారోగ్యకర ఆన్‌లైన్ గేమ్స్ ప్రభావానికి గురవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆన్‌లైన్ ప్రవర్తనను గమనించాలని, వారు ఏ యాప్స్ వాడుతున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే అంశాలపై అవగాహన తప్పనిసరని ఆమె ఈ సందర్భంగా సూచించారు. బాలల అత్యవసర సమస్యల పరిష్కారానికి చైల్డ్ లైన్ 1098 సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు.

అంతకుముందు, పట్టణ కేజీబీవీ, రిక్షా కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బాలల కమిషన్ బృందం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్, కమిషన్ సభ్యులు వందనగౌడ్, అపర్ణ, సప్తై, ప్రేమలత, వచన్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్ ఏఎస్పీలు సురేందర్ రావు, అవినాష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, నిర్మల్ డీఈవో భోజన్న, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్



గిరిజన ఆశ్రమ బాలిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ..



వంటశాలలో విద్యార్థుల కోసం వండిన వంటలను పరిశీలిస్తూ..

# విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

» పీవో యువరాజ్ మర్మాట్ » గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల పరిశీలన » ఏమైయికుంటలో పత్తి కొనుగోళ్ల ప్రారంభం

ఇంద్రవెల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించాలని సమగ్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. రికార్డులు, తరగతి గదులు, పరిసరాలు పరిశీలించారు. వంటశాలలో వంటకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, విద్యార్థులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. మెనూ పాటిస్తూ పోషక విలువలతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలి

ఇంద్రవెల్లి: పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఏమైయికుంట గ్రామంలోని రైతు ఉత్పాదక సంఘం జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ మాట్లాడుతూ మండలంలోని 878 ఉన్న రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతుధర పొందాలన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, సీసీఐ సీపీఓ నరేష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నన్న ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మాట్




పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

» రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీలు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల నిర్వహణను అరికట్టాలి అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ సిబ్బందికి క్రమశిక్షణ సమయపాలనతో పాటుగా, నీతి నిజాయితీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది వ్యవస్థ కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్

(తరువాయి 6వ పేజీలో....)

## శాస్త్రీయ ధృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగాలి

» ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్య
» జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు
» పెద్దసంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ ధృక్పథాన్ని పెంపొందించుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఎంఈవో సోమయ్య సూచించారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శుక్రవారం మండలస్థాయి చెకుముఖి సైన్స్ సంబరాలను నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఆసక్తిగా పరీక్షలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో సోమయ్య మాట్లాడుతూ.. సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటూ శాస్త్రీయ ధృక్పథంతో విద్యార్థులు ఎదిగినట్లయితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



ఆదిలాబాద్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

(తరువాయి 6వ పేజీలో...)

## కదం తొక్కిన పత్తి రైతులు

» సమస్యలు పరిష్కరించాలని జాతీయ రహదారిపై బైఠాయింపు

వివరాలు 7వ పేజీలో...

## ఆదిలాబాద్ ఏఎస్పీగా మౌనిక నియామకం

» త్వరలో బాధ్యతల స్వీకరణ

వివరాలు 6వ పేజీలో...

## షాంపూర్ వంతెన వద్ద రోడ్డు ప్రమాదం

» ముగ్గురికి తీవ్ర గాయాలు
» ఉట్నూర్ ఆసుపత్రికి తరలింపు అక్కడి నుంచి రిమ్స్‌కు

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

» బోథ్ రేంజ్ కార్యాలయానికి వాహనం తరలింపు

వివరాలు 7వ పేజీలో...